క్లుప్తంగా

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్ల పంపిణీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు రామారావు, స్టాలిన్

గాజువాక: సీఎల్‌సీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ చైర్మన్ మహంతి ఆధ్వర్యంలో శ్రీనగర్‌లోని సీఎల్‌సీ మినిస్ట్రీస్ భవంతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్‌ల చేతుల మీదుగా మహిళలకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా సీఎల్‌సీ చైర్మన్ మాట్లాడుతూ పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలన్న ఉద్దేశంతో కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మహిళా పోలీస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలిగా శ్రీలక్ష్మి



పెదగంట్యాడ: రాష్ట్ర గ్రామ/వార్డు సచివాలయాల మహిళా పోలీస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలిగా భానోజీతోట సచివాలయంలో పనిచేస్తున్న టీవీ శ్రీలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు మహాలక్ష్మి నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. తనపై నమ్మకంతో ఉపాధ్యక్షురాలిగా నియమించిన మహాలక్ష్మితోపాటు ప్రధాన కార్యదర్శి మధులత, సంయుక్త కార్యదర్శి రాధికకు శ్రీలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ సేవలు భేష్



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు త్రిఫ్ట్ సొసైటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని సీఎండీ అతుల్ భట్ అన్నారు. త్రిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో స్టీల్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 2020 - 21, 2021 - 22 సంవత్సరాల్లో విద్యలో ప్రతిభ చూపిన 83 మంది విద్యార్థులకు రూ.2.48 లక్షల చెక్కులు, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో పోటీ పెరిగి మరింత ఉజ్వల స్థితికి చేరుకుంటారన్నారు. సొసైటీ కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పిల్లలు విద్యలో ప్రతిభ చూపి మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యక్షులు కె.ఆనందకుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ఓబీసీ కేటగిరీ వారికి ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. డైరెక్టర్లు కె.శ్రీనివాస్, బి.లాలూ, జి.వి.రమేష్, వి.జి.మహీధర్, సీనియర్ మేనేజర్ కె.దామోదర్‌రెడ్డి, స్టీల్ సిటు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కలిసిన బీజేపీ నాయకులు

గాజువాక: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి పి.వి.ఎన్.మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు సోమ వారం 70వ వార్డు ఎల్వీ నగర్‌లో పలువురు ఉపాధ్యాయులను కలిశారు. వార్డులోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి ఓట్లను అభ్యర్థించడంతోపాటు ఓటు వేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో గాజువాక కో ఆర్డినేటర్ కరణం రెడ్డి నర్సింగరావు, దీనంకొండ కృష్ణంరాజు, కోడూరు లక్ష్మీనారాయణ, నిర్మలా కిశోర్, విజయలక్ష్మి, పావని, రోహిణి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల్లా రహదారులు

- 86, 87 వార్డుల్లో పడకేసిన పారిశుధ్యం
- వ్యర్థాల దుర్గంధంతో ప్రజల అవస్థలు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



రాజీవ్‌నగర్ ఎల్ఐజీ అపార్ట్‌మెంట్ల వద్ద రోడ్డు పక్కన వ్యర్థాలు



సిద్ధార్థనగర్ శ్మశానవాటిక పక్కన ప్రధాన రహదారిలో గుట్టలుగా పేరుకుపోయిన చెత్త

కూర్మన్నపాలెం: పారిశ్రామిక ప్రాంతంలో పారిశుధ్యం పడకేసింది. రహదారులన్నీ చెత్త, డెబ్రిస్, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో దోమలు వ్యాప్తి చెంది నివాసులు అనేక రోగాల బారిన పడుతున్నారు. పరిసరాల శుభ్రత లోపించడంతో పందుల సంచారం అధికమై వీధులన్నీ కంపుకొడుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

గుట్టలు గుట్టలుగా చెత్త..

ముఖ్యంగా 87వ వార్డు సిద్ధార్థనగర్ శ్మశానవాటిక పక్కన, 86వ వార్డు రాజీవ్‌నగర్ వుడా ఎల్ఐజీ అపార్ట్‌మెంట్స్ రహదారిలోనూ చెత్తాచెదారం గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. ఈ రోడ్డులో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తున్నాయి. వాహన చోదకులు జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. లక్షల రూపాయలతో నిర్మించిన డ్రైనేజీలు సైతం పర్యవేక్షణ లేక దీనస్థితిలో ఉన్నాయి. చెత్తతోపాటు ఇటీవల భవన నిర్మాణ వ్యర్థాలను సైతం ఇక్కడికే తీసుకొచ్చి డంపింగ్ చేయడంతో అసలు ఇవీ రోడ్లా.. లేక డంపింగ్ యార్డ్‌లా అనే సందేహం కలుగుతోంది. ఈ చెత్తలోనే ఆహార పదార్థాలతో కూడిన ప్లాస్టిక్ సంచులు ఉండటంతో పశువులు వీటిని తినడంతో మృత్యువాత పడుతున్నాయి. ఈ సమస్యలపై జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు వాపోతున్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు..

రహదారుల పక్కన చెత్తను వేయడంతో వాటి నుంచి వచ్చే దుర్వాసనతో స్థానికులు సతమతమవుతున్నారు. ప్రతి రోజు సేకరించిన చెత్తను రోడ్డు పక్కన వేయడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. చెత్తను కాల్చడంతో వచ్చే పొగతో అటుగా ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ప్లాస్టిక్ నియంత్రణ జాడేది..

ప్లాస్టిక్‌ను నియంత్రిస్తామన్న జీవీఎంసీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్లపై వేస్తున్న వ్యర్థాల్లో 90 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉండటం ఇందుకు నిదర్శనం. ప్లాస్టిక్ కవర్లు గాలికి ఎగురుతూ రోడ్లన్నీ చెత్తగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి సకాలంలో చెత్తను తరలించే చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఆధార్ క్యాంప్ ప్రారంభం



ఆధార్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం గాంధీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని అంబేడ్కర్ కళాక్షేత్రం(సీడబ్ల్యూసీ-1)లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌ను సోమవారం హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కునగరం వాసుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాక్షేత్రం కార్యదర్శి దొక్క నర్సింగరావు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటలకు ఆధార కార్డు వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చునన్నారు. మార్చి 11 వరకు జరిగే ఈ క్యాంప్‌లో ప్రతి రోజు 250 మందికి సేవలు అందిస్తారని చెప్పారు. సేవలు అవసరమైన వారు తమ గుర్తింపు కార్డు, చిరునామా పత్రాలను తీసుకురావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు, కళాక్షేత్రం కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్వాసితుల శాశ్వత ఉపాధికి వినతి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామమోహనరావుకు వినతిపత్రం అందిస్తున్న పులి వెంకటరమణారెడ్డి

పెదగంట్యాడ: ఉక్కు పరిశ్రమ నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఎ.మల్లికార్జున, స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె.వి.వి.ఎస్.రామమోహనరావులను సోమవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం ఇళ్లు, భూములు కోల్పోయారని, అందులో కొంతమందికి ఉపాధి కల్పించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలుగా ఉపాధి కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో చర్చలు జరిపి నిర్వాసితులకు న్యాయం చేయాలని విన్నవించారు.

డొంకాడలో కల్యాణ మండపం నిర్మించాలి

అగనంపూడి: అగనంపూడి పునరావాస కాలనీ సెక్టార్-1 డొంకాడలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కల్యాణ మండపం నిర్మించాలని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్‌ను అగనంపూడి కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రంలో కోరారు. ఉక్కు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం సీఎండీని కలిసిన నాయకులు అగనంపూడి పునరావాస కాలనీలో పన్నెండేళ్ల కిందట ఆధునిక వసతులతో ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. స్థల వివాదం వల్ల అప్పట్లో పనులు ప్రారంభించలేదని, 2014లో స్థల వివాదం పరిష్కారమైందని, యాజమాన్యం స్పందించి కల్యాణ మండపం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వాకింగ్ ట్రాక్ వద్ద హైమాస్ట్ దీపాలు వెలిగించాలని, బెంచీలు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలో ఉన్న ఎస్‌డీసీ కార్యాలయ భవనాన్ని సేవా సంస్థలకు కేటాయించాలని నాయకులు బి.సత్యనారాయణ, కె.అప్పారావు, బి.అప్పారావు, సాంబశివరావు, సూర్యనారాయణ తదితరులు విన్నవించారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి



సంజీవ కాలనీ పాఠశాలలో కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



64వ వార్డులో పట్టభద్రులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ధర్మాల శ్రీను

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఆధ్వర్యంలో సోమవారం వార్డులోని సంజీవ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి ప్రాధాన్యతా ఓటును సీతంరాజుకు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మంగునాయుడు, జుత్తు లక్ష్మి, పెంద్రరాజు, సతీష్, రాంబాబు, అన్నాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

64వ వార్డులో..

వైఎస్సార్‌సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో వార్డులోని సత్యనారాయణపురం, యాతపాలెంలో జోరుగా ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి తొలి ప్రాధాన్యతా ఓటును సీతంరాజు సుధాకర్‌కు వేసి గెలిపించాలని కోరారు. పితాని అన్నవరం, సారిపిలి అప్పారావు, సంపంగి వెంకటేష్, పితాని పైడిరాజు, పితాని నరేష్, బాషా, వెంకట్, ఢిల్లీ, వెంకటేష్ పాల్గొన్నారు.

65వ వార్డులో..

వైఎస్సార్‌సీపీ 65వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో వార్డులోని భానోజీతోటలో విస్తృతంగా ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యతా ఓటు వేయాలని అభ్యర్థించారు. లోకనాథరావు, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, మద్దాల మణికంఠ, పప్పల పుష్ప, కంబాల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం



746వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 746వ రోజుకు చేరుకున్నాయి. సంస్థకు చెందిన ఎం.ఎస్.ఎం, ఎస్.టీ.ఎం విభాగాల నాయకులు, కార్మికులు దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపారు. కార్మికులు న్యాయం జరిగే వరకు దీక్షను విరమించేదిలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే కార్మికుల జీవితాలు సర్వనాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను కాపాడుకోవాలంటే ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

జెడ్పీ హైస్కూల్‌కు స్మార్ట్‌బోర్డు వితరణ



మాట్లాడుతున్న కార్పొరేటర్ లతీష్

అక్కిరెడ్డిపాలెం: డిజిటల్ ప్రపంచంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పాత్ర ఇండియా సహకరించడం సంతోషంగా ఉందని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ లతీష్ అన్నారు. వార్డులోని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సోమవారం పాత్ర ఇండియా సౌజన్యంతో రూ.2.50 లక్షల విలువ చేసే స్మార్ట్‌బోర్డును కార్పొరేటర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారంతో క్రమశిక్షణతో చదువుకుని మంచి భవిష్యత్‌ను అందుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని, వాటిని దేశంలోని రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. ఇటువంటి సంస్థలు ముందుకొచ్చి ప్రభుత్వానికి చేదోడు వాదోడుగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాత్ర ఫౌండేషన్ ఎండీ డి.లక్ష్మి ముక్కావిల్లి, పాఠశాల హెచ్‌ఎం కాంతం, పీడీ షేక్ ఇస్మాయిల్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ ఫార్మా కళాశాలలో మహిళా దినోత్సవం



వేడుకలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాలలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా ప్రారంభమైంది. అసోసియేషన్ ఫార్మసీ టీచర్స్ ఇండియా, ఏపీ ఉమెన్స్ ఫోరమ్, విజ్ఞాన్ ఫార్మా కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ప్రతి రంగంలోనూ సముచిత స్థానం దక్కించుకుంటున్నారని, వారి కృషి ఫలితంగా సమాన అవకాశాలు దక్కుతున్నాయన్నారు. సమాజంలో గుర్తింపుతో రాణిస్తున్న మహిళల గురించి వివరించారు. అనంతరం మోహన్ ఫౌండేషన్ సహకారంతో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ఏఎస్ఎస్ పీవో సత్యలక్ష్మి, కో ఆర్డినేటర్ గుణ మంజూష తదితరులు పాల్గొన్నారు.

మెజీషియన్ విజయకుమార్‌కు గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న విజయకుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మాజీ అధికారి, మెజీషియన్ కె.విజయకుమార్‌కు గోల్డ్ మెడల్ లభించింది. ఈ నెల 26న నెల్లూరులో మాయా జాల మ్యాజిక్ కన్వెన్షన్ నిర్వహించారు. జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ కేటగిరీల్లో జరిగిన మ్యాజిక్ పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 350 మంది ఇంద్రజాలికులు పాల్గొన్నారు. సూప ర్ సీనియర్ విభాగంలో విజయకుమార్ బంగారు పతకం గెలుపొందారు. మ్యాజిక్ స్టార్ బోస్, మేజిక్ ఆర్టిస్టిక్ మనోహర్, టైగర్ మొహమ్మద్‌ల చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు.

విభాగాధిపతి దృష్టికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు



ఉక్కు వైర్ రాడ్ మిల్ విభాగాధిపతి శర్మను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైర్ రాడ్ మిల్ విభాగం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి.తౌడన్న నేతృత్వంలో సోమవారం నాయకులు విభాగాధిపతి శర్మను కలిసి సమస్యలను వివరించారు. విభాగం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా విభాగం గౌరవాధ్యక్షుడిగా ఎ.రవీంద్రనాథ్, సలహాదారుడిగా ఎ.బాలస్వామి, అధ్యక్షుడిగా ఎస్.వెంకటశెట్టి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా పి.అప్పారావు, బి.తిరుపతిరావును నియమించినట్టు వారు తెలిపారు. అనంతరం విభాగాధిపతికి నూతన కార్యవర్గ జాబితాను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌బాబు, పుల్లారావు, పైడికొండలరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో గిరిజన మహిళకు దొరకని బెడ్

- బెడ్ ఇచ్చామంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్



కేజీహెచ్ రాజేంద్రప్రసాద్ వార్డులో నేల మీద పడుకున్న గిరిజన మహిళ



మంచం మీద తల్లిదండ్రులతో కృష్ణవేణి

మహారాణిపేట: కేజీహెచ్‌లో గిరిజన మహిళకు బెడ్ కేటాయించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే ఆస్పత్రి పిల్లల వార్డులో గిరిజన పసికందు మృతి చెందడం, మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై తరలించిన ఘటన మరిచిపోక ముందే మరో గిరిజన మహిళకు బెడ్ ఇవ్వలేదన్న వార్తలు వస్తున్నాయి. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముంచంగిపుట్ మండలం వనగుమ్మ గ్రామానికి చెందిన కె.కృష్ణవేణిని తల్లిదండ్రులు ఈనెల 25న వైద్యం కోసం కేజీహెచ్‌లో చేరిృంచారు. దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ఆమె ఊపిరితిత్తుల్లో నీరు చేరింది. దీంతో 25న రాత్రి భావనగర్ వార్డులో చేర్పించి చికిత్స అందజేశారు. చికిత్సతో వ్యాధి తగ్గుముఖం పట్టడంతో కృష్ణవేణిని రాజేంద్రప్రసాద్ వార్డు 'డి' బ్లాక్‌కు ఆదివారం తరలించారు. అక్కడ పడకలు ఖాళీ లేవు. మరో మహిళ ఉండే మంచాన్ని కృష్ణవేణికి కేటాయించారు. అంటే ఒకే మంచాన్ని ఇద్దరు ఉపయోగించాలన్న మాట. అయితే ఈ మంచం తీసుకోవడానికి కృష్ణవేణి నిరాకరించారు. అప్పటికే ఆ వార్డులో ఒక మహిళ చనిపోవడంతో కృష్ణవేణి అక్కడ ఉండడానికి నిరాకరించినట్లు బంధువులు తెలిపారు. అయితే కృష్ణవేణి ఆ వార్డులోనే కింద పడుకుని రాత్రి నిద్రించారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తెల్లవారే సరికి జిల్లాలో వైద్యులు అప్రమత్తం అయ్యారు. ఆగమేఘాల మీద కృష్ణవేణికి మంచం కేటాయించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని, వార్డులో పడకలు ఖాళీ లేకపోయినా ఆమెకు మంచం ఇచ్చామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. రోగిని మంచం మీదకి మార్పు చేస్తున్న సమయంలో ఎవరో ఫొటో తీశారని, ఆమెకు మంచం నిరాకరించినట్టు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని సూపరింటెండెంట్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

ముగిసిన కరాటే పోటీలు

కంచరపాలెం: కంచరపాలెం డీఎల్‌బీ కమ్యూనిటీ హాల్‌లో యంగ్ ఇండియన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకులు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ప్రథమ స్థానంలో వీవీవీ స్కూల్-స్టీల్‌ప్లాంట్, రెండో స్థానంలో రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్-మధురవాడ నిలిచాయి.

రహదారి స్థలంలో దుకాణాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



దుకాణాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు ప్రశాంతినగర్‌లోని స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి రహదారిలో అక్రమంగా ఏర్పాటు చేసిన కంటైనర్ దుకాణాలను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. 'రహదారి స్థలంలో దుకాణాలు' అనే శీర్షికన ఈ నెల 24న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఉదయం పోలీసుల సహకారంతో జీవీఎంసీ సిబ్బంది అక్కడికి చేరుకొని కంటైనర్ల తొలగింపు చర్యలు చేపట్టారు. గతంలో ఒకసారి ఇదే స్థలంలో రేకుల షెడ్లు వేయగా.. వాటిని తీసివేశారు. మళ్లీ రాత్రికి రాత్రే సదరు స్థలంలో కంటైనర్లను తీసుకొచ్చి దుకాణాలు తెరవడంతో స్థానికులు ఫిర్యాదు చేయడం, 'సాక్షి'లో కథనం వెలువడటంతో జీవీఎంసీ అధికారులు ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారు.

బీసీ గేటు రోడ్డులో సమస్యలు పరిష్కరించండి



స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ జీఎం చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు రహదారిలో ఉన్న సమస్యల వల్ల ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని డీవీఆర్ స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తెలిపారు. సోమవారం నాయకులు టౌన్ అడ్మిన్ జీఎం చంద్రశేఖర్‌ను కలిసి సమస్యలను చర్చించి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రతి రోజు వందలాది మంది కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు బాలచెరువు రహదారిలో స్టీల్‌ప్లాంట్‌కు విధుల నిమిత్తం ప్రయాణిస్తున్నారన్నారు. ఆ దారి సరిగా లేకపోవడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఆ మార్గంలోని పెట్రోల్ బంక్ నుంచి పోర్టు బ్రిడ్జ్ వరకు రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాల పార్కింగ్ వల్ల మరింత ఇరుగ్గా మారిందన్నారు. గతంలో సేఫ్టీ టైంలో ఇతర వాహనాలకు హోంగార్డ్ ద్వారా నియంత్రణ ఉండేదన్నారు. హోంగార్డ్‌ను ఏర్పాటు చేయడంతోపాటు రహదారి మరమ్మతులు వంటి చర్యలు చేపట్టాలని కోరారు. యూనియన్ అధ్యక్షుడు గల్లా శంకర సాయిరామ్, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణారెడ్డి, పేర్ల నూకరాజు, జి.సూర్యనారాయణ, మజ్జి సూరిబాబు, శివశంకర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, అప్పలరెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రావుల చెరువు వద్ద విద్యుద్దీపాలు పునరుద్ధరించండి

గాజువాక: కూర్మన్నపాలెం రావుల చెరువు వద్ద విద్యుద్దీపాలను పునరుద్ధరించాలని రావుల చెరువు రాయల్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో రూ.4 కోట్లతో రావుల చెరువు చుట్టూ వాకింగ్ పార్కును సుందరంగా అభివృద్ధి చేశారని, ప్రతి రోజు వెయ్యి మంది వరకు నడిచేవారని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఇప్పుడు ఈ చెరువు చుట్టూ ఉన్న విద్యుద్దీపాలు పనిచేయడం లేదని, చివరకు విద్యుత్ మీటరును కూడా తొలగించారని వివరించారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి విద్యుత్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అసోసియేషన్ నాయకులు బి.ఎల్లాజీరావు, కె.జనార్దనరావు తదితరులున్నారు.